## క్లుప్తంగా

### ఘనంగా చండీయాగం


పూజల్లో పాల్గొన్న భక్తులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ దేవాలయంలో గురువారం సప్తశతి చండీయాగం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ బీమోజు రమణాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. మూడు రోజుల పాటు నిర్వహించే పూజ కార్యక్రమాల్లో మొ దటి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### చిన్నారులకు అక్షరాభ్యాసం


అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఏసీసీ 3 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య, పిల్లలకు పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నామని, తల్లిదండ్రులు వారి పిల్లలను పంపించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ఎస్.పద్మ, సహాయకురాలు లత పాల్గొన్నారు.

### ఉచిత నేత్ర వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

మంచిర్యాలటౌన్: గర్మిళ్ల లయన్స్ క్లబ్, రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నారాయణ హైస్కూల్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150మంది రాగా, వారికి బీపీ, షుగర్‌తో పాటు, కంటి పరీక్షలు నిర్వహించారు. 60మందికి కంటి ఆపరేషన్ చేయాల్సిందిగా గుర్తించగా, మొదటి విడతగా 30మందిని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గర్మిళ్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మోదుంపురం వెంకటేశ్వర్, నేత్ర వైద్యుడు సీహెచ్. ప్రభాకర్, సుగుణాకర్ రెడ్డి, సద్దెనపు రాంచందర్, శ్రీరామోజు రమేష్, సీహెచ్ రాఘవేంద్రరావు, శంకర్ లింగం, వేముల ప్రవీణ్ పాల్గొన్నారు.

### విశిష్ట ఉత్పత్తి కేంద్రం సందర్శన


నిర్వాహకులతో విద్యార్థులు

మందమర్రిరూరల్: సింగరేణి ఆధ్వర్యంలోని రామకృష్ణాపూర్ సూపర్‌బజార్ ఆవరణలో నిర్వహిస్తున్న విశిష్ట ఉత్పత్తుల కేంద్రాన్ని మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు గురువారం సందర్శించారు. కేంద్రం నిర్వాహకులు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎంబ్రాయిడరీ, బట్టతో చేతి సంచుల తయారీ ఉత్పత్తుల తయారీ విధానంతో పాటు సింగరేణి తోడ్పాటు గురించి వివరించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విశిష్ట ఉత్పత్తుల కేంద్రం సందర్శించడం వల్ల విద్యార్థులకు ఉత్పత్తుల తయారీపై అవగాహన ఏర్పడుతుందన్నారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది శ్రీకాంత్, కమలాకర్, శిక్షకురాలు స్వప్న ఉన్నారు.

### 'ఇబ్బందులకు గురిచేస్తున్న ఇరిగేషన్ అధికారులు'

భీమారం: మండల కేంద్రంలోని ఊరచెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, తన పట్టా భూమిలో సర్వే చేస్తూ ఇరిగేషన్ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని భీమారం మండల కేంద్రానికి చెందిన కట్కూరి ప్రకాశ్‌రెడ్డి అనే రైతు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. ఊరచెరువు ఆక్రమణ విషయంలో అప్పటి కలెక్టర్ భారతీ హోళీకేరి స్వయంగా ఉండి సర్వే చేసి, హద్దురాళ్లు వేయించినట్లు తెలిపారు. కాగా ఇప్పుడు చెరువు భూమి కాకుండా, తన పట్టా భూమిలో ఇరిగేషన్‌శాఖ అధికారులు సర్వే చేస్తామనడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. చెరువును సర్వేలపేరుతో ఇరిగేషన్ అధికారులు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

# సమస్యల పరిష్కారానికి కృషి

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్


లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఏఎంసీ క్రీడా మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఎమ్మెల్యే వినోద్ ముఖ్య అతిథిగా హాజరై 335మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు తనపై ప్రగాఢ విశ్వాసం ఉంచి అధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారని, ఓట్లేసి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోవడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని పట్టించుకోలేదని విమర్శించారు. వేమనపల్లి మండలం దయనీయ స్థితిలో ఉందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ బెల్లంపల్లిలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరిస్తానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఆర్డీవో కార్యాలయ ఏవో శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభాకర్, సూరం సంగీత, నీలి కృష్ణ, మాటూరి మధు, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ మహేందర్, మాజీ ఏఎంసీ చైర్మన్ కారుకూరి రాంచందర్, నియోజకవర్గ మండలాల నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**'ఎమ్మెల్యేను సన్మానించిన ఐఎన్టీయూసీ నాయకులు'**

తాండూర్: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను బెల్లంపల్లి ఏరియా ఐఎన్టీయూసీ నాయకులు ఘనంగా సన్మానించారు. తాండూర్ పర్యటనలో భాగంగా గురువారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యేకు తాండూర్ ఐబీ మండల కేంద్రంలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సిద్దంశెట్టి రాజమొగిళి, కేంద్రం కమిటీ నాయకుడు సంఘం ప్రకాష్ తదితరులు శాలువా కప్పి, పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. సింగరేణి కార్మిక హక్కుల సాధన కోసం కృషి చేయాలని ఐఎన్టీయూసీ నాయకులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా నాయకులు సార్ల రమేష్, రాజయ్య, సోకాల శ్రీనివాస్, శంకర్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

**'వీవోఏల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతి'**

బెల్లంపల్లి: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు వినతి పత్రం అందజేశారు. బెల్లంపల్లిలోని పద్మశాలీ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ వీవోఏలు ఎమ్మెల్యే వినోద్‌ను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా కృషి చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వీవోఏలు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడానికి తప్పకుండా కృషి చేస్తానని వినోద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు నస్పూరి రజిత, జిల్లా కోశాధికారి పొట్ట పోశం, మండల అధ్యక్షులు, నాయకులు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే దంపతులకు సన్మానం**

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని 26వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రియాజ్ వినోద్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ దంపతులను గురువారం సన్మానించారు. బెల్లంపల్లి అభివృద్ధికి చేయడానికి కృషి చేయాలని రియాజ్ కోరారు. కార్యక్రమంలో వార్డు మహిళా కాంగ్రెస్ నాయకురాలు స్వరూప, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్

బెల్లంపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న డిగ్రీ విద్యార్థులు ఉపకార వేతనాలు, బోధనా వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీ.ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి నూతన, రెన్యూవల్ దరఖాస్తులు చేసుకోవడానికి ఎస్సీ సంక్షేమ శాఖ ఆదేశాలను జారీ చేసిందన్నారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోని వారు తప్పకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024–25సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెన్నూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 6వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తెలిపారు.

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 2024–25విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల బెల్లంపల్లి ప్రిన్సిపాల్ స్వరూప గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశం ఉంటుందన్నారు. 2023–24విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఈ నెల 6వ తేదీలోగా ఆసక్తి గల ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఉపాధ్యాయులకు సన్మానం


తాళ్లపేటలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం తెలుగు కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం సుదర్శన్, రిసోర్స్ పర్సన్ కొండు జనార్దన్, తెలుగు భాషోపాధ్యాయులు, మహిళ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రసవాలు ప్రభుత్వాసుపత్రిలో జరిగేలా చూడాలి

- జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు


మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు

మందమర్రిరూరల్: ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేలా చూడాలని జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు వైద్య సిబ్బందికి సూచించారు. మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించి పిల్లలకు సరైన సమయంలో టీకాలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఫయాజ్ ఖాన్, వైద్యాధికారి రమేష్, సీహెచ్‌వో గంగాధర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశవర్కర్లు ఉన్నారు.

## వైభవంగా కార్మెల్ హైస్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు, నిర్వాహకులు


విద్యార్థుల నృత్య ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: స్థానిక కార్మెల్ హైస్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్మెల్ స్కూల్ విశిష్టత, సాధించిన ప్రగతిపై విద్యార్థులు తమ ప్రదర్శనల ద్వారా కళ్లకు కట్టినట్టు చూపించారు. ఒకరికొకరు పోటీపడి ప్రదర్శించిన నృత్యాలు సభికులు ఆసాంతం ఎంతో ఆసక్తితో తిలకించారు. ఈ సందర్భంగా అతిథులు, విద్యార్థులు, పాఠశాల నిర్వహకులు మాట్లాడుతూ.. ఎందరినో ఉన్నత స్థానాల్లో నిలబెట్టిన ఘనత కార్మెల్ హైస్కూల్‌కు దక్కుతుందన్నారు. 1973లో ప్రారంభమైన పాఠశాలలో చాలా మంది విద్యార్థులు ఇక్కడ చదివి ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తుచేశారు. గోల్డెన్ జూబ్లీ సందర్భంగా పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. వాటర్ ఫౌంటేన్, రంగు రంగుల విద్యుత్ బల్బులతో అలంకరించగా విద్యార్థులు, తల్లిదండ్రులు సెల్ఫీ దిగారు. కార్మెల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రిన్సి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్మెల్ హైస్కూల్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ మదర్‌జియో ఫిలిప్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, ఎంఈవో పోచయ్య, కౌన్సిలర్ లావణ్య, జడ్డి సంపత్, ఆదిలాబాద్ డియోసెస్ బిషప్ ప్రిన్సిస్ జోసఫ్, జోసఫ్ కున్నత్, జోసఫ్ మనికథాన్, జ్యోతిస్ మరియా, కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ (సీబీఎస్ఈ) ప్రిన్సిపాల్ రినేట్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా భైరవాష్టమి వేడుకలు


భైరవుడికి పూజలు చేస్తున్న భక్తులు


ఆలయం వద్ద భక్తజనం

కోటపల్లి: మండలంలోని పార్‌పల్లిలో కొలువైన భైరవ దేవాలయంలో గురువారం జయంతిని పురస్కరించుకుని భైరవుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పార్‌పల్లి గుట్టలో వెలిసిన భైరవస్వామిని ఉదయం నుంచే భక్తులు దర్శనం చేసుకున్నారు. పార్‌పల్లి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులతో పాటు చెన్నూర్, గోదావరిఖని, తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. హోమ గుండాలను కాల్చి, కాళీక మాతకి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. చెన్నూర్‌కు చెందిన మార్వాడీలు వారి కుటుంబాలతో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక ప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సమయంలో దీపోత్సవంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తుల భజనలతో పార్‌పల్లి గుట్టలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి.

## రాములోరి అక్షింతల పంపిణీ


భీమారం: అక్షింతలు అందిస్తున్న భక్తులు

భీమారం: మండల కేంద్రంలోని ఇంటింటికీ గురువారం శ్రీరాముని భక్తులు రాములోరి అక్షింతలను అందజేశారు. ఈ మేరకు అక్షింతలు తెచ్చిన వారికి ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

చెన్నూర్: పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికీ అయోధ్య శ్రీరాముని అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో పట్టణంలోని ప్రధాన రహదారుల్లోని హిందూ కుటుంబాలకు అక్షింతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ


మంచిర్యాలటౌన్: దరఖాస్తులు స్వీకరిస్తూ...


కోటపల్లి: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో


నర్సాపూర్‌లో...

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి, అంగ్రాజ్‌పల్లి, సుందరసాల, వెంకంపేట గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కొనసాగింది. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అజ్మత్‌అలీ, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కోటపల్లి/వేమనపల్లి/భీమిని: ప్రభుత్వ పథకాల కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమాల్లో కోటపల్లిలో ఎంపీడీవో భాస్కర్, ఏవో మహేందర్, వేమనపల్లిలో ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, భీమినిలో ఎంపీడీఓ రాధాకిషన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని బాదంపల్లి, లోతొర్రె, దేవునిగూడ గ్రామాల్లో 'ప్రజాపాలన' నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణారాణి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనలో 10,387దరఖాస్తులు**

జైపూర్: మండలంలో గల 20గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఐదు గ్యారంటీల అమలులో భాగంగా చేపట్టిన గ్రామసభల్లో మండల వ్యాప్తంగా 10వేల 387దరఖాస్తులు వచ్చాయి. వారం రోజుల పాటు మండల వ్యాప్తంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా 10,387దరఖాస్తులు వచ్చినట్లుగా మండల ప్రత్యేక అధికారి రమేష్ తెలిపారు.

### ప్రజాపాలన పరిశీలన


దండేపల్లి: నాగసముద్రంలో దరఖాస్తు దారులతో అదనపు కలెక్టర్ మోతీలాల్

దండేపల్లి: మండలంలోని నాగాసముద్రంలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఏ యే పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు, దరఖాస్తు ఫారాలు కొనుక్కున్నారా? జీపీ వారు ఇచ్చారా అని ఆరా తీశారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ భూమన్న, సర్పంచ్ ప్రేమల, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**వేగవంతం చేయాలి**

లక్సెట్టిపేట: ప్రజాపాలన దరఖాస్తులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను గురువారం పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తు దారులకు ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

**వెల్లువెత్తుతున్న దరఖాస్తులు**

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 36వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన సభల్లో ప్ర భుత్వ పథకాలు ఆరు గ్యారంటీల కోసం పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తులను చేసుకుంటున్నారు. గురువారం 2,251మంది దరఖాస్తు చేసుకోగా, 24,471దరఖాస్తులు ఇప్పటి వరకు మొత్తంగా వ చ్చినట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ తె లిపారు. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు ఇతర సమస్యలపై దరఖాస్తులు 922వరకు వచ్చాయన్నారు.

తాండూర్: మండలంలోని నర్సాపూర్, చౌటపల్లి గ్రామాల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ రెబ్బెన యశోద, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ అధికారి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

### విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చెన్నూర్: ఉచిత విద్యా, ఉపాధి కల్పన సాధన కోసం ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12న తలపెట్టిన చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ అన్నారు. చలో పార్లమెంట్ కరపత్రాలను గురువారం విడుదల చేశారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 3 శాతం నిధులు కేటాయిస్తుందన్నారు. కనీసం విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అనిల్, దినేశ్, శేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

## పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



కోటపల్లి: మండలంలోని దేవులవాడ, కోటపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎంలు కృష్ణమూర్తి, దామోదర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కొమట్ల బాపు, అంజన్‌కుమార్, పవన్, మూర్తి పాల్గొన్నారు.

## 'పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

బెల్లంపల్లి: గ్రామానికి సంబంధం లేని వ్యక్తుల ఇళ్లకు ఇంటి నెంబర్లు జారీ చేసిన తాండూర్ మండలం పోచంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. పోచంపల్లి గ్రామ శివారు ప్రాంతంలో సింగరేణి కంపెనీ ఓసీపీ ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోందని తెలిపారు. ఆ సమాచారం తెలుసుకుని వేరే ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు అనుమతి లేకుండా, అక్రమంగా ఇళ్లు నిర్మించుకుని ఇంటి నంబర్లు కేటాయిస్తున్నారని తెలిపారు. విద్యుత్ మీటర్లు తీసుకుంటున్నారని, కానీ స్థానికులకు మాత్రం ఇంటి నంబర్లు కేటాయించకుండా కార్యదర్శి తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నిసార్లు అడిగినా కార్యదర్శి అశ్రద్ధ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని, అక్రమ పద్ధతిలో జారీ చేసిన ఇంటి నంబర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

### ఆర్థిక సాయం

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేటకు చెందిన రామంచ రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధితకుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు జీవన్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. జీవన్‌కుమార్ రూ.5వేలు, నాయకులు రూ.5వేలు ఆర్థికసాయం చేశారు.